క్లుప్తంగా

వెయిట్‌లిఫ్టింగ్‌ పోటీల్లో సత్తా



కోచ్‌ అప్పలరామయ్యతో రాజేష్‌, గణేష్‌

నరసన్నపేట: స్థానిక వీరహనుమాన్‌ వ్యాయామశాలలో శిక్షణ పొందుతున్న నరసన్నపేట ప్రభుత్వ జూనియర్‌ కళాశాల విద్యార్థులు పి.రాజేష్‌, పి.గణేష్‌ రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్‌ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారు. 68వ అంతర్‌ జిల్లాల వెయిట్‌లిఫ్టింగ్‌ పోటీలు గుంటూరు జిల్లా తెనాలిలో ఈ నెల 2 నుంచి 4వ తేదీ మధ్య జరిగాయి. అండర్‌–17 విభాగంలో పాల్గొన్నారు. రాజేష్‌ 73 కేటగిరీలో స్నాచ్‌, క్లీన్‌ అండ్‌ జర్క్‌ కలిపి మొత్తం 171 కేజీల బరువు, గణేష్‌ 81 కేజీల విభాగంలో 172 కేజీల బరువు ఎత్తారని వ్యాయామ శాల కోచ్‌ అప్పలరామయ్య తెలిపారు.

నైపుణ్య గణన పక్కాగా చేపట్టాలి


మాట్లాడుతున్న ఎంపీపీ గోపి

జలుమూరు: నైపుణ్య గణన పారదర్శకంగా చేపడితే ఉపాధి కల్పనకు దోహదపడుతుందని ఎంపీపీ వాన గోపి అన్నారు. సోమవారం మండల పరిషత్‌ కార్యాలయంలో నైపుణ్య గణనపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టాలన్నారు. ఎంపీడీఓ కొమరాపు తిరుపతిరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

700 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

హిరమండలం: మండలంలోని బీఆర్‌పురం సమీపంలోని కొండ ప్రాంతంలో సోమవారం నిర్వహించిన దాడుల్లో 700 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని శ్రీకాకుళం ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. సారా తయారు చేసినా, రవాణా చేసినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ దాడుల్లో కొత్తూరు సీఐ కిరణ్‌, ఎస్‌ఐ అప్పారావు, ఎక్సైజ్‌ పోలీసులు పాల్గొన్నారు.

టెట్‌ ఫలితాల్లో ప్రతిభ


కృష్ణారావును సత్కరిస్తున్న యువకులు

మెళియాపుట్టి: మండలంలోని కొసమాల గ్రామానికి చెందిన యువకుడు పెద్దింటి కృష్ణారావు సోమవారం విడుదలైన టెట్‌ ఫలితాల్లో సత్తా చాటాడు. 150 మార్కులకు 145.15 మార్కులు సాధించాడు. తల్లిదండ్రులు, బంధువులు అభినందించారు. కృష్ణారావును దుక్క బాలరాజు, పలువురు యువకులు సత్కరించారు.

స్థలాన్ని సేకరించాలి

ఎల్‌.ఎన్‌.పేట: సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రభుత్వ పెట్రోల్‌ బంక్‌ ఏర్పాటుకు, ఎల్‌.ఎన్‌.పేట తహసీల్దార్‌ కార్యాలయం నూతన భవనం నిర్మాణానికి స్థల సేకరణ చేయాలని సర్వే సిబ్బందికి తహసీల్దార్‌ ఈశ్వరమ్మ ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో మాట్లాడారు. పెట్రోల్‌ బంక్‌ నిర్మాణానికి 40 సెంట్లు, తహసీల్దార్‌ కార్యాలయ నిర్మాణానికి 10 సెంట్లు అవసరం అవుతుందన్నారు. వేర్వేరు ప్రాంతాల్లో స్థల సేకరణ చేయాలని సూచించారు. కలెక్టర్‌ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు నాలుగు రోజుల్లో స్థలాన్ని గుర్తించి అప్పగించాలన్నారు. ఆర్‌ఐ గవరయ్య, మండల సర్వేయర్‌ ఉమామహేశ్వరరావు, గ్రామ సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

పీజీ కోర్సులు ప్రారంభం

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభించిన పీజీ కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అంబేడ్కర్‌ యూనివర్సిటీ సైన్స్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ కె.ఉదయ్‌భాస్కర్‌ అన్నారు. నరసన్నపేట ప్రాంతంలో విద్యార్థుల సౌకర్యార్థం రెండు పీజీ కోర్సులను మంజూరు చేసి, వీటిని సోమవారం ప్రారంభించామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్‌ పి.లత మాట్లాడుతూ ఎమ్మెస్సీ ఆర్గానిక్‌ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కంప్యూటర్‌ సైన్స్‌ కోర్సులు ప్రారంభించినట్లు తెలిపారు. డాక్టర్‌ గొలివి మోహనరావు, ఊణ్ణ రంగనాథ్‌, పాగోటి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

సారవకోట: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఐటీడీఏ పీఓ దృష్టికి స్థానిక గిరిజన నాయకులు తీసుకెళ్లారు. మెళియాపుట్టిలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం, తాగునీటి సదుపాయం, ఇతర మౌలిక వసతులు కల్పించాలని కోరారు. గిరిజన ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి చౌదరి లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షుడు జన్ని రామారావు పాల్గొన్నారు.

కొండలను పిండేస్తున్నారు..!


గాజులకొల్లివలస, చిట్టివలస మధ్యలో కొండను తవ్విన అక్రమార్కులు

- నిత్యం వందల ట్రాక్టర్లు, లారీలతో ఎర్రమట్టి, గ్రావెల్‌ తరలింపు..
- రియల్‌ వెంచర్ల యజమానులకు విక్రయం
- చోద్యం చూస్తున్న అధికారులు

ఆమదాలవలస: గ్రావెల్‌ మాఫియా చెలరేగిపోతోంది. కొంతమంది అక్రమార్కులు కొండలు, గుట్టలను పిండి చేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఎర్రమట్టి, కంకరను యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఆమదాలవలస మండలంలోని సైలాడ రెవెన్యూ సర్వే నంబర్‌ 183లో గల సంగమేశ్వర స్వామి కొండను తవ్వి ఎర్ర మట్టిని విక్రయిస్తున్నారు. ఈ విషయంపై మండల స్థాయి అధికారులకు స్థానికులు సమాచారం ఇచ్చినా చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గాజులుకొల్లివలస జగనన్న కాలనీ పక్కనే ఉన్న అనధికార క్వారీని కేంద్రంగా చేసుకొని ఎర్రమట్టిని ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. సచివాలయం పక్క నుంచే లారీలు వెళ్తున్నా.. అటువైపు కన్నెత్తి కూడా చూడటంలేదు.

అనుమతి తప్పనిసరి..

మట్టిని తరలించాలంటే గ్రామ పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ అధికారుల అనుమతి తప్పనిసరి. ఎటువంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా ఎర్రమట్టిని శ్రీకాకుళం రూరల్‌ మండలం, ఆమదాలవలస పట్టణం, అలికాం–బత్తిలి రహదారికి దగ్గరలో నూతనంగా వేస్తున్న రియల్‌ ఎస్టేట్‌ వెంచర్‌కు దర్జాగా విక్రయిస్తున్నారు. ప్రభుత్వం ఒకవైపు మట్టి మాఫియాపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నప్పటికీ.. అది ప్రకటనలకే పరిమితమవుతోంది. ఎంతో ప్రతిష్ట గల సంగమేశ్వరస్వామి కొండ స్వరూపం మారిపోతున్నప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్న విషయంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పర్యావరణాన్ని పరిరక్షించాలని, సంగమేశ్వరస్వామి కొండను రక్షించాలని కొల్లివలస, చిట్టివలస, ఆర్‌ఆర్‌కాలనీ ప్రజలు కోరుతున్నారు.

ఎవరి వాటా.. వారికి ఇచ్చేశాం..

క్షేత్రస్థాయి సిబ్బందితో ముందుగా తాము మాట్లాడుకున్న తరువాతే మట్టిని తరలిస్తున్నామని మాఫియాదారులు దర్జాగా చెబుతుండటం విశేషం. అందుకే అధికారులు ఎవరూ తమను ప్రశ్నించడం లేదని మట్టి మాఫియాకు చెందిన ఓ వ్యక్తి బహిరంగా చెబుతున్నారు. ఎవరి వాటా వారికి ఇచ్చేశాం.. లైన్‌ క్లియర్‌ అంటూ మట్టిని తరలిస్తున్నారు.


సంగమేశ్వరస్వామి ఆలయం సమీపంలో గ్రావెల్‌ను తరలించేందుకు సిద్ధం చేసిన లారీ


ట్రాక్టర్‌తో తరలిస్తున్న ఎర్రమట్టి

స్పందించని ఏడీ!

ఇదే విషయమై గనులు శాఖ ఏడీ మోహన్‌రావును వివరణ కోసం పలుమార్లు సంప్రదించగా.. ఆయన స్పందించలేదు. గనులశాఖ ఆర్‌ఐ మాణిక్యాలరావును ప్రశ్నించగా.. తాను ఈ విషయంపై ఏమీ మాట్లాడకూడదన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులతో మాట్లాడుకోవాలన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఆమదాలవలస మండలం, పట్టణ పరిధిలో ఎర్రమట్టి, గ్రావెల్‌, కంకర తవ్వకాలకు ఎవరికీ ఎటువంటి అనుమతి ఇవ్వలేదు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. గాజులకొల్లివలస, చిట్టివలస, ఆర్‌ఆర్‌ కాలనీల వద్ద గల సంగమేశ్వరస్వామి కొండలను తవ్వుతున్నారని మా దృష్టికి వచ్చింది. పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– ఆర్‌.రాంబాబు, తహసీల్దార్‌, ఆమదాలవలస

ఎక్కడి సమస్యలు అక్కడే..



సరుబుజ్జిలి తహసీల్దార్‌ కార్యాలయంలో పూర్తి స్థాయి సిబ్బంది లేకపోవడంతో పనులు ముందుకు సాగడంలేదని అర్జీదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పనిచేసిన డీటీ, ఆర్‌ఐ, సర్వేయర్‌ బదిలీపై వెళ్లారు. సర్వేయర్‌ పోస్టును భర్తీ చేశారు. బదిలీపై వచ్చిన సీనియర్‌ అసిస్టెంట్‌ బాధ్యతలు స్వీకరించిన వెంటనే దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారు. రెగ్యులర్‌ ఆర్‌ఐ లేకపోవడం వల్ల సీనియర్‌ వీఆర్వో ఇన్‌చార్జి ఆర్‌ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రీ సర్వే డీటీ.. ఇన్‌చార్జి డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ధ్రువీకరణపత్రాల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతుందని రైతులు, విద్యార్థులతోపాటు అర్జీదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – సరుబుజ్జిలి

పొంచి ఉన్న ప్రమాదం



పాతపట్నం మండలం పెద్దసున్నాపురం సమీపంలోని రుగడ–పర్లాకిమిడి ఆర్‌అండ్‌బీ రహదారి మధ్యలో పెద్ద రంధ్రం ఏర్పడింది. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రహదారి మీదుగా కొత్తూరు, రుగడ, శోదతోపాటు పలు గిరిజన గ్రామాల ప్రజలు, వాహనదారులు ఒడిశాలోని పర్లాకిమిడికి వెళ్తుంటారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారి మధ్యలో ఏర్పడిన రంధ్రాన్ని పూడ్చాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. – పాతపట్నం

స్వచ్ఛత ఎక్కడ?



ఆమదాలవలస మున్సిపాలిటీ 21వ వార్డు కుద్దిరాం ఎస్సీ కాలనీలోని డ్రైనేజీలో మురుగు పేరుకుపోయింది. నిత్యం దోమల బెడదతోపాటు దుర్వాసనతో రోగాల బారిన పడుతున్నామని ఆ కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. తమ గ్రామంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు మున్సిపల్‌ పారిశుద్ధ్య సిబ్బంది ఎవరూ రావడంలేదని ఆరోపిస్తున్నారు. మున్సిపల్‌ అధికారులు స్పందించి కాలువల్లో పూడికలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. – ఆమదాలవలస

పట్టపగలే వెలుగులు



కొత్తూరు మండలం కొళ్యాపురం మెయిన్‌ రోడ్డులో పట్టపగలే విద్యుత్‌ దీపాలు వెలుగుతున్నాయి. గత కొద్ది రోజులుగా రాత్రీపగలూ లేడా లేకుండా వెలుగుతున్నా.. పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. – కొత్తూరు

ఎండీఎంలో నాణ్యత లోపిస్తే చర్యలు


భోజనం నాణ్యతపై ఉపాధ్యాయులను ప్రశ్నిస్తున్న డిప్యూటీ ఈఓ విజయకుమారి

సరుబుజ్జిలి: మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఆర్‌.విజయకుమారి హెచ్చరించారు. మండలంలోని సరుబుజ్జిలి, చినకాగితాపల్లి జిల్లా పరిషత్‌ హైస్కూళ్లను సోమవారం తనిఖీ చేశారు. సరుబుజ్జిలి హైస్కూల్‌లో భోజన విషయంలో నాణ్యత పాటించడంలేదని పలు ఫిర్యాదులు వస్తున్నట్లు తెలిపారు. భోజన విషయంలో అధ్యాపకులు ఎందుకు బాధ్యత తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఎంఈఓలు శ్రీనివాసరావు, బాలరాజు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

సాక్షి ఎఫెక్ట్‌: పిచ్చిమొక్కల తొలగింపు


పిచ్చిమొక్కలు తొలగించిన తరువాత ఇలా..

కొత్తూరు: కొత్తూరులోని నవిగాం రోడ్డుకు ఆనుకొని ఉన్న విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న నిర్లక్ష్యం శీర్షికతో ఇటీవల వార్త ప్రచురితమైంది. దీనిపై విద్యుత్‌ అధికారులు సోమవారం స్పందించారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న పిచ్చిమొక్కలను తొలగించారు.

బుడ్డివలసలో పారిశుధ్య పనులు


రోడ్డును శుభ్రం చేసిన కార్మికులు

సరుబుజ్జిలి: చిగురువలస పంచాయతీ పరిధిలోని బుడ్డివలసలో పంచాయతీ అధికారులు సోమవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఇటీవల ప్రచురితమైన అపారిశుధ్యం విలయతాండవం కథనానికి అధికారులు స్పందించారు. గ్రామంలోని రహదారుల మధ్య నిల్వ ఉన్న మురుగునీరు, మట్టి, చెత్తకుప్పలను గ్రామానికి సుదూరంగా తరలించారు.

హరహర మహాదేవ


కొత్తూరు: మెట్టూరు బిట్‌–1 శివాలయం వద్ద మహా రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు

కార్తీక మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని శివాలయాలన్నీ హర నామస్మరణతో మార్మోగాయి. వేకువ జామునుంచే భక్తులు బారులు తీరారు. శివుడికి రుద్రాభిషేకాలు నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దాతలు భక్తులకు ఓటర్‌ ప్యాకెట్లు, ప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్‌


జలుమూరు: శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి


పాతపట్నం: ప్రత్యేక అలంకరణలో నీలకంఠేశ్వర స్వామి


ఆమదాలవలస: రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు


నరసన్నపేట: భ్రమరాంబికామల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


సరుబుజ్జిలి: పెద్దపాలెంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో శివలింగానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు


ఎల్‌.ఎన్‌.పేట: కొత్తపేట శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


హిరమండలం: పాత హిరమండలంలోని శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


మెళియాపుట్టి: చాపరలో శివగణార్చన పూజలు నిర్వహిస్తున్న భక్తులు

'సూపర్‌ సిక్స్‌' అమలులో వైఫల్యం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎల్‌.ఎన్‌.పేట: ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన సూపర్‌ సిక్స్‌ హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చడంలో వైఫల్యం చెందిందని, హామీలను తక్షణమే నెరవేర్చాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ పెనుమజ్జి విష్ణుమూర్తి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, జెడ్పీటీసీ సభ్యుడు కిలారి త్రినాథులు డిమాండ్‌ చేశారు. మండల కేంద్రంలో సోమవారం విలేకర్ల సమావేశంలో వీరు మాట్లాడారు. ప్రజలకు మోసం చేయటం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. 50 ఏళ్ల వయసు నిండిన బీసీలకు పింఛన్లు ఎప్పుడు ఇస్తారో తెలియజేయాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నెలకు రూ.1500, రైతులకు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి పథకాలు ఎందుకు అమలు చేయటం లేదన్నారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు.. రహదారుల అభివృద్ధి కోసం నిధులు తెచ్చానని అన్ని గ్రామాల్లోనూ శంకుస్థాపనలు చేసి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపించారని గుర్తుచేశారు. ఎంపీపీ కిమ్మ సాంబశివరావు, పార్టీ నాయకులు ముగడ జనార్దన, ఈగల చిన్నారావు, రెడ్డి లక్ష్మణరావు, బలగ గోవిందరావు, కాగాన సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు


ఎమ్మెల్యే గోవిందరావుకు సమస్యలు వివరిస్తున్న విద్యార్థినులు

పాతపట్నం: మండలంలోని కాగువాడ గ్రామంలో గల మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ గురుకుల పాఠశాలలోని సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు విద్యార్థినులు కోరారు. సోమవారం సాయంత్రం పాఠశాలను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. తమకు ఇన్వర్టర్‌ కావాలని విద్యార్థినులు విన్నవించారు. అధ్యాపకులు అనవసరంగా దుర్భాషలాడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వంట గదిని ఎమ్మెల్యే పరిశీలించిన సమయంలో ఇద్దరు కుక్‌లు లేకపోవడంతో వంట ఎలా చేస్తున్నారని, సాయంత్రం నాలుగు గంటలకే కుక్‌లు వెళ్లిపోతే ఎలా అని ప్రశ్నించారు. అన్నం, సాంబారు, కూరలు ఉడకలేదని, వీటిని విద్యార్థులకు ఇలాగే పెడుతున్నారా అని ప్రిన్సిపాల్‌ జి.శ్రీరాములపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్‌ ఎం.రామారావు పాల్గొన్నారు.

వితరణ..

మెళియాపుట్టి: మండంలోని కరజాడ గ్రామంలో గల నీలకంఠేశ్వర ఆలయానికి ఆటో యూనియన్‌ సభ్యులు, ధర్మశాస్తా అయ్యప్ప సన్నిధానం యూనియన్‌ సభ్యులు కలిసి రూ.15 వేల విలువ గల ఎలక్ట్రికల్‌ ఇన్‌స్ట్రుమెంట్స్‌ (మేళం, తాళాలు) వితరణగా అందించారు. గురుస్వాములు మురళీ బ్రహ్మ, ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు


ఎలక్షన్‌ డీటీ శంకర్‌కు దరఖాస్తులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

పాతపట్నం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఓటర్ల కోసం అర్హత గల ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమ ఓటును నమోదు చేసుకుంటున్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్‌ కార్యాలయంలో ఎలక్షన్‌ డీటీ వాన శంకర్‌కు పలువురు ఉపాధ్యాయులు తమ ఓటు నమోదుకు దరఖాస్తులు అందజేశారు.

నైపుణ్య గణనతో ఉపాధి కల్పన


పోలాకి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి: ఉపాధి అవకాశాల కల్పనకు నైపుణ్య గణన ఎంతో ఉపయోగపడనుందని, ఈ సర్వేకు అధికారులు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండల పరిషత్‌ సమావేశ మందిరంలో సోమవారం ఎంపీడీఓ రవికుమార్‌ అధ్యక్షతన క్షేత్రస్థాయి సిబ్బందికితో జరిగిన శిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రతి ఇంటికీ వెళ్లి 15 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సు గల వారి డేటాను సేకరించి, నైపుణ్య గణన ఉపయోగాలను వివరించాలన్నారు.

నైపుణ్య గణనపై శిక్షణ..

సరుబుజ్జిలి: మండలంలో నైపుణ్య గణన సక్రమంగా చేపట్టాలని ఎంపీడీఓ ఎం.పావని తెలిపారు. మండల పరిషత్‌ కార్యాలయంలో ఆవరణలో సోమవారం సచివాలయ సిబ్బందికి స్కిల్‌ సెన్సస్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సూపరింటెండెంట్‌ వరప్రసాద్‌ పాల్గొన్నారు.